క్లుప్తంగా

ప్రసన్నకు శుభాకాంక్షలు



కోవూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు.

• కొడవలూరు మండలం యల్లాయపాళెం పంచాయతీకి చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకటరమణారెడ్డి, గ్రామ అధ్యక్షుడు పూండ్ల రఘురెడ్డి, దేవిరెడ్డి సాయిరెడ్డి, తాడిపత్రి భాస్కర్, తమ్మిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, జెడ్డా జనార్దన్, తమ్మిరెడ్డి అనిల్‌రెడ్డి, శ్రీకాంత్, శ్రీను కలిసి శుభాకాంక్షలను తెలియజేశారు.

పందుల స్వైరవిహారం



కోవూరు: స్థానిక పంచాయతీ పరిధిలో పందుల స్వైరవిహారం నానాటికీ అధికమవుతోంది. శాంతినగర్‌లో సమస్య తీవ్రంగా ఉంది. చెత్త పేరుకుపోతుండటం.. కాలువల్లో మురుగు నిల్వ ఉండటంతో పందుల సమస్య ఎక్కువవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఓటును తప్పక నమోదు చేసుకోండి



సూచనలిస్తున్న నిర్మలానందబాబా

కోవూరు: ఓటును ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని తహసీల్దార్ నిర్మలానందబాబా పేర్కొన్నారు. కోవూరులోని పలు పోలింగ్ కేంద్రాలను శనివారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఓటరు ప్రత్యేక నమోదు దినాన్ని ఆదివారం నిర్వహించనున్నామని చెప్పారు. బీఎల్వోలు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో తప్పక ఉండాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ రవి, ఆర్‌ఐ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు స్టీల్ బాటిళ్ల పంపిణీ



కోవూరు: కోవూరులోని లక్ష్మీపార్వతి వృద్ధాశ్రమంలో 28 మందికి స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. యేడెం తిరుపతిరెడ్డి జయంతిని పురస్కరించుకొని గంగవరం సర్పంచ్ యేడెం లక్ష్మీకుమారి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. డాక్టర్లు హరిచందన, ఫణిచందన తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ రిషితా కిరణ్

పొదలకూరు: వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పొదలకూరు కో - లొకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి రిషితా కిరణ్ పేర్కొన్నారు. పట్టణంలోని బీసీ బాలికలు, ఎస్సీ బాలుర వసతి గృహాలను శనివారం వైద్యాధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు సీజనల్‌గా ప్రబలుతున్నట్టు తెలిపారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. హాస్టళ్లలో ఉన్న మరుగుదొడ్లు, వంట గదులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు మస్తాన్‌బీ, ఏఎన్‌ఎంలు కామాక్షమ్మ, వెంకటేశ్వర్లు, అరుణ, ఆశావర్కర్లు రమాదేవి, పెంచలనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

విశేషాలంకరణలో వెంకయ్యస్వామి

మనుబోలు: మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో ఉన్న భగవాన్ శ్రీవెంకయ్యస్వామి మందిరంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసులు పంచామృతాభిషేకం జరిపించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ జరిగింది. చేవూరు రమేష్ - రమ్య దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

సంకల్పంతో ముందుకు సాగుతూ..

• రెండు చేతులు లేకున్నా సమర్థవంతంగా విధులు
• స్ఫూర్తినిస్తున్న బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్

పొదలకూరు: ఎం.సునీల్‌కుమార్.. ఈయన సంకల్పం ముందు దురదృష్టం ఓడింది. చిన్నతనంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో రెండు చేతులు, ఒక కాలు కోల్పోయినా తల్లిదండ్రుల అండదండలు, కఠోర శ్రమతో బ్యాంక్ ఉద్యోగం సాధించారు. పట్టుదల ఉంటే మనిషి ఏదైనా సాధించగలడని నిరూపించారు. అంగవైకల్యం రూపంలో విధి వెక్కిరించినా గుండె ధైర్యంతో ముందుకు సాగుతున్నారు. సమర్థుడైన అధికారిగా పేరు సంపాదించారు. అందరికీ స్ఫూర్తినిచ్చే రీతిలో విధులు నిర్వహిస్తున్నారు.

వెంకటాచలం మండలం కాకుటూరుకు చెందిన సునీల్‌కుమార్‌కు తొమ్మిది సంవత్సరాల వయసున్నప్పుడు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో రెండు చేతులు, ఒక కాలు కోల్పోయారు. విధి వంచించినా కుంగిపోకుండా చదువుకుంటూ ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు కృషి చేశారు. దీనికి కుటుంబ సభ్యుల సహకారం తోడైంది. బీటెక్ పూర్తి చేసి బ్యాంకింగ్ రంగంలో చేరేందుకు పోటీ పరీక్షలు రాశారు. ఏడేళ్ల క్రితం ఉద్యోగం సాధించారు. తొలి పోస్టింగ్ కింద హైదరాబాద్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో చేరి కొంతకాలం పనిచేశారు. ఇటీవల అసిస్టెంట్ మేనేజర్‌గా పొదలకూరు స్టేట్ బ్యాంక్‌కు బదిలీపై వచ్చారు.



పేపర్లపై సంతకాలు పెడుతున్న సునీల్‌కుమార్

వేగంగా పనిచేస్తూ..

సునీల్‌కుమార్ తన విధులను వేగంగా నిర్వహిస్తారు. రెండు చేతులు లేకున్నా కంప్యూటర్, సెల్‌ఫోన్ ఆపరేటింగ్ చకచకా చేస్తారు. బ్యాంక్‌లో వివిధ రకాల రుణాలు మంజూరు చేసే అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన పనిని పరిశీలిస్తే సకలత్వం ఉన్నవారిని అబ్బుర పరుస్తుంది. ఎవరి సహకారం లేకుండానే తన విధులను పరిపూర్ణంగా నిర్వహించడం అలవాటు చేసుకున్నారు. చక్కటి చేతిరాతతో సంతకం చేస్తారు. కోల్పోయిన కుడిచేతికి రబ్బర్ బ్యాండ్ తగిలించుకుని అందులో పెన్ ఏర్పాటు చేసుకుని సంతకాలతో అవసరమైన రికార్డులను కూడా వేగంగా రాయడం సునీల్‌కుమార్ ప్రత్యేకత. ఈయన పనితీరును చూసి ఖాతాదారులు అభినందిస్తుంటారు. తన కారును తానే కాకుటూరు నుంచి డ్రైవింగ్ చేసుకుని రావడం కొసమెరుపు.

నెల్లూరు రూరల్ డీఎస్పీ విచారణ

పొదలకూరు: కులదూషణ కేసుపై నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు శనివారం విచారణ నిర్వహించారు. పట్టణంలోని ఓ సివిల్ వివాదంలో నెల్లూరుకు చెందిన కారు డ్రైవర్ మహేష్‌ను కొందరు కులం పేరుతో దూషించారని గతనెల 19వ తేదీన పొదలకూరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. ఈ కేసును విచారించేందుకు డీఎస్పీ వచ్చారు. డీఎస్పీ వెంట సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్సై ఎస్కే హనీఫ్ ఉన్నారు.

పశుపోషణపై అవగాహన కలిగి ఉండాలి

వెంకటాచలం: పశుపోషణపై రైతులు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని కనుపూరు పశువైద్యాధికారిణి పి.శ్రీలక్ష్మి సూచించారు. మండవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పాలిచెర్లపాడు గ్రామంలో శనివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎదకు రాని గేదెలకు పరీక్షలు నిర్వహించి చికిత్స చేశారు. అలాగే సాధారణ వ్యాధులకు గురైన గేదేలకు చికిత్స చేసి, దూడలకు నట్టల నివారణకు సంబంధించిన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ నవంబర్ నెల నుంచి ఫిబ్రవరి నెల వరకు గేదెలు, ఆవుల్లో జలగ వ్యాధి అధికంగా ప్రబలుతుందని తెలియజేశారు. పాడి రైతులు గేదెలకు ప్రబలే వ్యాధులపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సూచించారు.



నట్టల నివారణ మందుల పంపిణీ

కార్యక్రమంలో ఫౌండేషన్‌కు చెందిన వైద్యులు శ్రీనివాసులునాయుడు, పశువైద్య సహాయకులు రామరాజు, గోపాలమిత్ర గడ్డం రాము, శ్రావణ్‌కుమార్, రమణయ్య, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం నక్షత్రం శ్రవణా నక్షత్రం సందర్భంగా శ్రీనివాసుని కల్యాణం కమనీయంగా జరిగింది. ఉభయకర్తలుగా ఆలయ కమిటీ సభ్యులు అన్నం లక్ష్మీనారాయణ - లక్ష్మి దంపతులు వ్యవహరించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో కల్యాణంలో పాల్గొన్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు



ప్రత్యేకాలంకరణ

మనుబోలు: కార్తీక మాసం సందర్భంగా శనివారం మండలంలోని పలు శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మనుబోలు, పిడూరు, మడమనూరు, కొలనకుదురు, వెంకన్నపాళెం, పిడూరుపాళెం, చెర్లోపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. అలాగే బద్దెవోలు రోడ్డు కండలేరు ఒడ్డున ఉన్న సంగమేశ్వర ఆలయంలో కూడా పెద్దఎత్తున భక్తులు పూజలు చేశారు.

ఘనంగా కాకాణి జన్మదిన వేడుకలు

పొదలకూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముందస్తు జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ యూత్ సెక్రటరీ రావుల ఇంద్రసేన్‌గౌడ్ ఆధ్వర్యంలో 60 కిలోల భారీ కేక్‌ను కాకాణి చేతుల మీదుగా నెల్లూరు క్యాంపు కార్యాలయంలో కట్ చేయించారు. కార్యక్రమంలో బిరదవోలు ఎంపీటీసీ సభ్యుడు రావుల దశరథరామయ్యగౌడ్, బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, ఎం.వెంకటశేషయ్య, పెదమల్లు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భారీ కేక్‌ను కట్ చేసిన కాకాణి

ఉపాధ్యాయుల హర్షం

పొదలకూరు: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు - 2024కు పొదలకూరు డీఎన్నార్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచర్‌గా పని చేస్తున్న ఏవీ సుధాకర్ ఎంపికయ్యారు. ఈనెల 11వ తేదీన విజయవాడలో అవార్డు అందుకోనున్నారు. సుధాకర్ 2002 నుంచి ఇప్పటి వరకు ఉద్యోగ ప్రస్థానంలో అనేక అవార్డులను స్వీకరించారు. విద్యార్థులను సైన్స్ సబ్జెక్ట్ పట్ల ఆకర్షితులను చేయడంతోపాటు రకరకాల ప్రయోగాలు చేయించారు. సుధాకర్ ఎంపికపై తోటి టీచర్లు హర్షం వ్యక్తం చేశారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



పొదలకూరు: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్



కొడవలూరు: సిబ్బందితో మాట్లాడుతున్న బ్రిజిత

పొదలకూరు: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మహ్మదాపురం పీహెచ్‌సీలో శనివారం వైద్యాధికారులు డాక్టర్ నరసింహారావు, డాక్టర్ స్రవంతిలు గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. సాధారణ ప్రసవం, ఆరోగ్య ఆసరా ప్రయోజనాలను వివరించారు. ఉచితంగా యూఎస్‌జీ, టిఫా స్కాన్ చేశారు. హైరిస్క్ గర్భిణులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రసవ సమయంలో మూడు, నాలుగు రోజుల ముందు రవాణా చేసేందుకు వాహన సదుపాయం గురించి వివరించారు.

• **కొడవలూరు:** గర్భిణుల్లో రక్తహీనత నివారణపై వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బ్రిజిత ఆదేశించారు. కొడవలూరు పీహెచ్‌సీలో శనివారం నిర్వహించిన పీఎం సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. 34 మంది గర్భిణులను పరీక్షించగా, నలుగురిలో రక్త శాతం తక్కువగా ఉందని గుర్తించారు. అనంతరం ఆమె మాట్లాడారు. పోషక విలువలపై గర్భిణులకు అవగాహన కల్పించి.. రక్తహీనతకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.



కొడవలూరు: యల్లాయపాళెం పీహెచ్‌సీలో..

ఈ నెల 14న నిర్వహించనున్న కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు రామకృష్ణ, బాలచంద్రబాబు, సీహెచ్‌ఓ సోమశేఖర్ పాల్గొన్నారు.

• మండలంలోని యల్లాయపాళెం పీహెచ్‌సీలో పీఎం సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బ్రిజిత పరిశీలించారు. వైద్యాధికారి కావ్య, హెచ్‌ఈఓ కోటేష్, హెచ్ఎస్ రజియా, ఎమ్మెల్‌హెచ్‌పీ సౌమ్య, ఎస్సెన్ స్వర్ణలత, ఏఎన్‌ఎంలు సుష్మ, సరిత పాల్గొన్నారు.

ఓటర్ల నమోదును సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న డీటీ

మనుబోలు: మండల వ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉప తహసీల్దార్ బషీర్ సూచించారు. మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటర్ల నమోదు ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించారు. శని, ఆదివారాల్లో ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఓటర్ల మార్పు చేర్పులు, తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు చేస్తామని తెలిపారు. శనివారం 13 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు నాగార్జునరెడ్డి, నాగేశ్వరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద నున్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో శనివారం ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ చాలా కీలకమైందన్నారు. దానిని ఆస్వాదిస్తూ మంచి మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అందుబాటులో ఉన్న మౌలిక వసతులను వినియోగించుకుని ఉన్నత స్థాయికి వెళ్లాలని తెలియజేశారు. సీఐ సుబ్బారావు మాట్లాడుతూ ర్యాగింగ్ బూతానికి బలై ఎంతోమంది జీవితాలను నాశనం చేసుకున్నారని తెలియజేశారు. మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. వీఎస్‌యూలో ఏదైనా చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు చేసినా, సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, ఎం.హనుమారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, ఎస్సై ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ విజయభాస్కరరావు

ఎమ్మెల్యే తనిఖీలు

బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని కూరగాయల మార్కెట్‌ను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శనివారం తనిఖీ చేశారు. మార్కెట్ ప్రాంతంలో నివాసాలను ఏర్పర్చుకున్న పందుల పెంపకందారులను ఇక్కడి నుంచి తరలించారు. ఈ నేపథ్యంలో మార్కెట్‌కు అనుసంధానమైన ఖాళీ ప్రదేశాన్ని కలుపుకొని నూతన మార్కెట్‌ను ఏర్పాటు చేసేందుకుగానూ ఆమె పరిశీలించారు. ఇప్పటి వరకు ఉన్న దుకాణదారులకు ప్రత్యామ్నాయం చూపాకే మార్కెట్‌ను తొలగిస్తామని వివరించారు. కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, నేతలు శేషయ్య, హరికృష్ణ పాల్గొన్నారు.



పర్యటిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు, నేతలు

సొసైటీల ద్వారా ఎరువుల పంపిణీ



జ్యోత్స్న రాణి, వ్యవసాయాధికారిణి

ముత్తుకూరు: రబీ సీజన్‌కు సంబంధించి వరి సాగుచేసే రైతులకు ఆర్‌బీకేల ద్వారా కాకుండా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా ఎరువుల సరఫరా జరుగుతుందని మండల వ్యవసాయాధికారిణి జ్యోత్స్న రాణి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ బీపీటీ 5204 రకం విత్తనాలు ఈనెల 10వ తేదీలోగా నారు పోసుకోవాలన్నారు. మిగిలిన రకాలు 15 తర్వాత నారు పోసుకుని విత్తుకోవచ్చన్నారు. నారు పోసే ముందు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సబ్సిడీపై విత్తనాలు అవసరమైన రైతులు తమను సంప్రదించాలని కోరారు.